క్లుప్తంగా

మైక్‌సెట్ వితరణ



లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ఖుద్రతున్నిసాబేగం మంగళవారం మైక్‌సెట్‌ను వితరణ చేశారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు నుంచి బదిలీపై ఇక్కడి పాఠశాలకు వచ్చిన ఆమె గతేడాది జూలై నెలలో పదవీ విరమణ చేశారు. రూ.15 వేలు విలువ చేసే మైక్‌సెట్‌తో పాటు ఒక గ్రీన్ బోర్డును పాఠశాలకు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం తాహెర్‌పాషా, సర్పంచు నాగరవిశంకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ సాగరాబేగం, ఉపాధ్యాయ బృందం దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

వికసిత్ భారత్‌పై అవగాహన



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మన సంకల్పం వికసిత్ భారత్ కార్యక్రమంపై యూనియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్, సిబ్బంది మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టర్ విడుదల చేశారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, బీమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణమ్మ, కార్యదర్శి సాదిక్, శంకర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మున్సిపల్ ఉద్యోగి మృతి

కొల్లాపూర్: మున్సిపాలిటీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న చుక్కాయిపల్లి గ్రామవాసి పరశురాముడు(55) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రాజయ్య, కౌన్సిలర్ బాలస్వామిలు గ్రామంలో మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 6 వరకు గడువు

కొల్లాపూర్ రూరల్: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ సాధారణ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కొల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తులు స్వీకరణకు జనవరి 6వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

ప్రజాపాలన పరిశీలన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో ఉన్న ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రాన్ని ఆర్డీఓ నాగరాజు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


పెద్దకొత్తపల్లి: గంట్రావుపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ భూతగాదాల వల్ల హత్యకు గురయ్యాడు. అదేవిధంగా గ్రామానికి చెందిన బాలస్వామి ఇటీవల మృతి చెందాడు. నారాయణపల్లి గ్రామానికి చెందిన పవన్ కుమార్ గౌడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావులు మంగళవారం ఆయా గ్రామాలకు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

రేషన్ డీలర్ మృతికి సంతాపం

కోడేరు: మండల కేంద్రంలోని 2వ రేషన్ డీలర్ రాములు(70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. తెల్లవారుజామున శ్వాస ఆడటం లేదని కుటుంబసభ్యులకు తెలపగా వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం పరామర్శించి రూ.5వేలు, 3వ రేషన్ డీలర్ శారద, సీహెచ్ శ్రీనివాసులు రూ.5వేలు, క్వింటాలు బియ్యం అందజేశారు. పలువురు రేషన్ డీలర్లు సంతాపం వ్యక్తం చేశారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని శివాలయంలో మంగళవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎంపీటీసీ రేణుకా నాగరాజు అన్నదానం చేశారు. అయ్యప్ప స్వాములు తిరుపతయ్య, మల్లేశ్, రాముడు, నరేష్ పాల్గొన్నారు.



పథకాలపై ఆశలు

తాడూరు: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలలో ఇప్పటికే రెండు పథకాలను అమలు చేస్తోంది. మిగతా పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరణ కోసం ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, గృహలక్ష్మి పథకాల కోసం అధికంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో ఎనిమిదేళ్లుగా రేషన్‌కార్డులు ఇవ్వలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో రేషన్‌కార్డులు అందుతాయని పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు. 2018లో అప్పటి ప్రభుత్వం కార్డుల కోసం ఆహ్వానించింది. మండలంలో అంత్యోదయ, ఆహార భద్రత కార్డులు కలిపి 11380 కార్డులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వంలో ఎలాంటి రేషన్ కార్డులు ఇవ్వకపోవడం వల్ల చాలా కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.

రేషన్ కార్డే ఆధారం

ప్రస్తుతం రేషన్‌కార్డుకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రమాదం జరిగితే ఖరీదైన వైద్యం కోసం రెవెన్యూ అధికారులు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుని తాత్కాలిక ఆరోగ్య శ్రీ కింద వైద్య ఖర్చుల పరిమితి రూ. 10లక్షలకు పెంచడంతో రేషన్ కార్డు కీలకంగా మారింది. అలాగే ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉపకార వేతనాలు పొందడానికి రేషన్ కార్డు ఆధారంగా తీసుకుని అధికారులు కులం, ఆదాయం, ఇతర ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. అలాగే సంక్షేమ పథకాలపై సైతం కీలకంగా మారడంతో రేషన్‌కార్డుల పంపిణీపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.



యాదిరెడ్డిపల్లిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ

మండలంలో ఇలా..

మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లి, ఐతోలు, సిర్సవాడ, ఇంద్రకల్, గ్రామాల్లో అధికారులు నిర్వహించిన ప్రజాపాలనలో 3208 దరఖాస్తులు ప్రజల నుంచి రాగా అందులో 875 దరఖాస్తులు రేషన్ కార్డులకు సంబంధించి అందినట్లు అధికారులు తెలిపారు.

రేషన్‌కార్డులు ఇవ్వాలి



గతంలో రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి అర్హులైన వారందరికి కార్డులు ఇవ్వాలి. ఇళ్లను మంజూరు చేయాలి.

– నాగయ్య, సర్పంచ్, పొలుమూరు

దరఖాస్తులను పరిశీలిస్తాం



ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులన్నింటిని పరిశీలించి జిల్లా స్థాయి అధికారులకు పంపిస్తాం. అధికారుల సూచనలు, సలహాల మేరకు ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందుతాయి.

– గంగమోహన్, ఎంపీడీఓ

అయోధ్య అక్షతల పంపిణీ



తెలకపల్లిలో అక్షతలను పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు



వెల్దండలో..

తెలకపల్లి: మండల కేంద్రంలో అయోధ్య రామమందిర పరమపవిత్రమైన పూజిత అక్షతల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. వీహెచ్‌పీ సభ్యులు, రామహనుమాన్ భక్తులు ఇంటింటికి వెళ్లి అందజేశారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికత, భక్తిభావంతో మెలగాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీరాములు గౌడ్, ఉమాపతి ఆచార్యులు, శంకరయ్య, నరేంద్రాచారీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షతలను ఊరేగించారు. హన్మాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. భజనలు, కీర్తనలు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు విజేందర్‌రెడ్డి, రామస్వామి, చిందం కృష్ణయ్య, మట్ట వెంకటయ్యగౌడు, శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, ఆంజనేయలు, కృష్ణారెడ్డి, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

మన్ననూర్: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో అయోధ్య రాముల వారి అక్షతలకు పూజలు నిర్వహించారు. విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేష్, భక్తులు శేఖర్, శ్రీనువాసులు, బాలకృష్ణ, పర్వతాలు, చంద్రమౌళి, శ్రీకాంత్, జయమ్మ, ప్రభావతమ్మ, అంబబాయ్ పాల్గొన్నారు.

గుర్తింపు ఉన్న హమాలీలకే పని కల్పించాలి

అచ్చంపేట రూరల్: అమ్రాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో గుర్తింపు ఉన్న హమాలీ కార్మికులతో పని చేయించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ కోరారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి నర్సింహులుకు గంగపుత్ర హమాలీ యూనియన్ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ అమ్రాబాద్ వ్యవసాయ మార్కెట్లో గంగపుత్ర హమాలీ కార్మికులు మూడు సంవత్సరాలుగా పని చేస్తున్నారని, కొంత మంది వ్యాపారులు రైతుల పొలాల వద్ద నుండే ధాన్యం కొనడంతో హమాలీలకు పని లేకుండా పోయిందన్నారు. వ్యాపారులు హమాలీలతోనే పని చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు వెంకటయ్య, కృష్ణయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న అమ్రాబాద్ హమాలీలు

ఐటీఐ కళాశాలలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని నేషనల్ ఐటీఐ కళాశాలలో చోరీ అయిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ప్రిన్సిపాల్ సమీఉల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తులు కళాశాల తలుపుల తాళాలు విరగొట్టి ప్రవేశించారు. ఐదు హెచ్, 10 హెచ్‌పీ కెపాసిటీ ఉన్న మోటారుకు సంబంధించిన కాపర్‌వైర్లతో పాటు సామాగ్రి, ఒక కంప్యూటర్, ఫ్యాన్లు చోరీ చేశారు. ప్రిన్సిపాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు .

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో మంగళవారం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం బైరాపూర్ గ్రామానికి చెందిన వరికుప్పల విష్ణు ఎలాంటి అనుమతులు లేకుండా బైరాపూర్ వాగు నుంచి అక్రమంగా ట్రాక్టర్‌తో ఇసుకను తరలిస్తున్నారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే బ్లూకోర్టు పోలీస్ సిబ్బంది గ్రామానికి చేరుకొని ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విష్ణుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రేషన్ డీలర్ సస్పెన్షన్

అమ్రాబాద్: మండలంలోని మాదవానిపల్లి డీలర్‌ను సస్పెండ్ చేసినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. రేషన్‌దుకాణం సక్రమంగా నడపడం లేదని ఇటీవల గ్రామస్తులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్డీఓ ద్వారా విచారణ చేశారని తెలిపారు. సూచిక బోర్డు, ధరల పట్టిక సక్రమంగా లేక పోవడం వల్ల సస్పెండ్ చేయడం జరిగిందని తహసీల్దార్ వివరించారు.

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ



పెద్దకొత్తపల్లి గంట్రావుపల్లిలో..



నాగర్‌కర్నూల్ కుమ్మెరలో



తిమ్మాయిపల్లిలో



లింగాల మండలం అప్పాయపల్లిలో



కొల్లాపూర్‌లో..

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని కుమ్మెరలో అధికారులు మంగళవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కోటేశ్వర్, అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 1000 వరకు దరఖాస్తులు అందాయి. సర్పంచ్ శ్రీదేవి, ఎంపీటీసీ హాజరయ్యారు. అదే విధంగా గగ్గలపల్లిలో తహసీల్దార్ చంద్రశేఖర్ దరఖాస్తులను స్వీకరించారు.

కొల్లాపూర్: పట్టణంలోని అన్ని వార్డులో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ రాజయ్య పర్యవేక్షించారు. కౌన్సిలర్ శ్రీలక్ష్మీయాదవ్ ఉన్నారు.

తెలకపల్లి: మండలంలోని రాకొండ, గట్టురాయిపాకుల, గడ్డంపల్లి, గట్టునెల్లికుదురు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం మొత్తం 1150 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. గట్టురాయిపాకులలో సర్పంచ్ లక్ష్మీ, ఎంపీటీసీ సభ్యుడు బాలయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వ్యవసాయాధికారి సందీప్ కుమార్‌రెడ్డి, ఎంపీఓ వెంకటయ్య పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లి, రామచంద్రాపురం, జేపల్లి గ్రామాల్లో మండల అధికారులు గ్రామ సభలు నిర్వహించి ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా అధికారి ఈడీ రాంలాల్ పర్యవేక్షించారు. ఎంపీఓ వెంకటేష్, తహసీల్దార్ నాగమణి, ఏఓ చిన్న హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావుపల్లి, చెన్నపురావుపల్లి, యాపట్ల గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులను అధికారులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, వైస్ ఎంపీపీ దీపికా లక్ష్మణ్‌రావు, సర్పంచ్‌లు చిన్నయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌రావు, ఎంపీటీసీలు రాంచంద్రయ్య, ఎంపీడీఓ కృష్ణయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అప్పాయపల్లి, మల్లొనిచెర్వుతండా, కొత్తకుంటపల్లి, కోమటికుంట, రాంపూర్ గ్రామాల్లో ప్రజాపాలన కొనసాగింది. ఆయా గ్రామాలను డీపీఓ, మండల ప్రత్యేకాధికారి కృష్ణ సందర్శించి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. మొత్తం 1,270 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. తహసీల్దార్ ఉమ, ఎంపీడీఓ గీతాంజలి, పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండలంలోని కొత్తపల్లిలో 410, కుమ్మరోనిపల్లిలో 370, జంగంరెడ్డిపల్లిలో 502 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ రామ్మోహన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని పల్గుతండాలో 26, శంకరకొండతండా 152, సిలోనిబావితండా 159, లింగారెడ్డిపల్లిలో 189 దరఖాస్తులను ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ రవికుమార్‌లు స్వీకరించారు.

తాడూరు: మండలంలోని చర్ల తిరుమలాపూరం గుంతకోడూరు, తుమ్మలసూగూరు, బలాన్‌పల్లి గ్రామాలలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ గంగమోహన్, సర్పంచ్‌లు నరేందర్, అశోక్, మాధవిలతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మాధవస్వామినగర్, యంగంపల్లి తండా గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ జమీల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, ఎంపీఓ భరత్, పాల్గొన్నారు.

మన్ననూర్: మాచారంలో గ్రామసభలను అమ్రాబాద్ ఎంపీడీఓ రామ్మోహన్ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రేణయ్య, సర్పంచ్ పెద్దిరాజు, ఉపసర్పంచ్ ఆనంద్, మల్లయ్య, అశోక్, సైదులు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని కొండ్రావుపల్లిలో గ్రామసభను ఎంపీపీ కొండ వెంకటరాధ ప్రారంభించారు. ఎంపీడీఓ బాలచంద్రసృజన, తహసీల్దార్ సైదులు, సర్పంచ్ వెంకటస్వామి, కొండ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవదృక్పథం అలవర్చుకోవాలి

కల్వకుర్తి టౌన్: ప్రతి ఒక్కరూ సేవదృక్పథం అలవర్చుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని సిలార్‌పల్లి వార్డులో ఠాగూర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మ అన్నపూర్ణ కార్డులను ఆయన అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సంఘం సభ్యులు 2007 నుంచి సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. వృద్ధాప్య పింఛన్‌దారులకు, ఒంటరి మహిళలకు అన్నపూర్ణ కార్డును ఇచ్చి నెలకు 9 కిలోల సన్నబియ్యాన్ని పూర్తి ఉచితంగా ఇవ్వడంపై ప్రశంసించారు. వార్డులోని బాలికలు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే వారికి 8–10వ తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా 8 సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం 140 మందికి ఉచిత బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సతీష్, మున్సిపల్ కౌన్సిలర్లు విజయలక్ష్మి, శ్రీను, ఎజాస్, బాలు నాయక్, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్ రెడ్డి, ఆనంద్ కుమార్, ఇతర నాయకులు, సంఘం సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



బాలికలకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్



జిల్లా కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మహేందర్



తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మహేందర్ వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంబర్ ప్లేట్ లేని వాహనాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న వారిని గుర్తింపు, మోటారు వాహన చట్టాలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు పెట్టుకున్న వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. తనిఖీలలో పట్టణ రెండో ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు సీజ్

కల్వకుర్తి టౌన్: పట్టణంలో నంబర్ ప్లేట్లు, వాహన పత్రాలు సరిగ్గా లేని వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో పోలీసులు బృందాలుగా పలుచోట్ల వాహనాల తనిఖీలు నిర్వహించారు. మొత్తం 40 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో మంగళవారం ఎస్‌ఐ వసురాం నాయక్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్స్, నెంబర్ ప్లేట్, ఆర్‌సీ, తదితర పత్రాలు లేని 15 బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తీసుకురావాలని అప్పుడే తమ వాహనాలు తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

అక్రమంగా ఇసుక తరలింపు

ఉప్పునుంతల: మండలంలోని మొల్గర వద్ద దుందుబీ వాగు నుంచి ఎంజీకేఎల్‌ఐ కాలువ విస్తరణ పనుల కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు పొందారు. అచ్చంపేట మండలంలోని పులిజాల నుంచి చందాపూర్ (చంద్రసాగర్) వరకు ఎంజీకేఎల్‌ఐ కాలువ విస్తరణ పనుల పేరిట 2 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక సేకరణకు గత డిసెంబర్ 6వ తేదీ నుంచి ఈనెల జనవరి 5వ తేదీ వరకు జిల్లా మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు లభించాయి. అనుమతి పొందిన కాంట్రాక్టర్ మొల్గర వద్ద వాగులో ఇసుకను టిప్పర్లకు నింపుతున్నారు. సంబంధిత ఇసుక కాంట్రాక్టర్ కాలువ పనులకు ఇసుకను తరలించకుండ ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. మంగళవారం మండలం సమీపంలోని వ్యవసాయ పొలంలో అక్రమంగా రెండు పెద్ద టిప్పర్లతో ఇసుకను డంపు చేశారు. ఈ విషయంపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ సరస్వతిని వివరణ కోరగా అనుమతులు పొందిన చోటుకే ఇసుకను తరలించాలే తప్పా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



ఉప్పునుంతల వ్యవసాయ పొలంలో ఇసుకను డంపు చేస్తున్న టిప్పర్లు

స్వయం ఉపాధితో మహిళల సాధికారత సాధ్యం

కందనూలు: స్వయం ఉపాధితో మహిళల సాధికారత సాధ్యమని సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు హకీం మురళి అన్నారు. జిల్లా కేంద్రంలోని భగవాన్ సత్యసాయి మందిరంలో ఇటీవల 50 రోజులుగా 51 మంది మహిళలకు ఉచితంగా మహిళా టైలరింగ్, మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇచ్చారు. మంగళవారం ముగింపు సందర్భంగా ఆయన మహిళలకు శిక్షణ ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం మురళీ మాట్లాడుతూ జిల్లాలో సత్యసాయిసేవాసంస్థ ద్వారా 18 సంవత్సరాలుగా మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి, విద్య, వైద్యం , ఆధ్యాత్మిక, సామాజిక, రంగాలలో సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ మాధవీలత జిల్లా మహిళ కోఆర్డినేటర్ నాగజ్యోతి, జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు గుబ్బ శంకరయ్య, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హాకిం విశ్వప్రసాద్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య సభ్యులు వి.బాలకృష్ణ, మహిళలు శిక్షకురాలు కే.సుమలత, జిల్లా మహిళా ఇన్‌చార్జ్ ఏం.సువర్ణ, ఇందిరమ్మ, కౌన్సిలర్ లలిత, సాయి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

ద్విచక్రవాహనం చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన సాయిబాబు గౌడ్ తన ఇంటిముందు ద్విచక్రవాహనం నిలిపి ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌ను తీసుకెళ్లారు. మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గీత కార్మికులు దరఖాస్తులు చేసుకోవాలి

చారకొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో లైసెన్స్ కల్గిన గీతా కార్మికులు ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం 50 సంవత్సరాలు పూర్తి అయిన గీతా కార్మికులకు పింఛన్ ఇచ్చారని గుర్తు చేశారు.

ఆదమరిస్తే అంతే

తాడూరు: మండలంలోని అంతారం, ఎటిదారిపల్లి, గోవిందాయిపల్లి మీదుగా ఐతోలుకు వెళ్లే ప్రధాన రహదారి గోవిందాయిపల్లి సమీపంలో కల్వర్టు దగ్గర మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల వాహనదారులు కోరుతున్నారు.



అధికారులను నిలదీసిన నాయకులు

వెల్దండ: మండలంలోని సిలోనిబావితండా, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఫొటోకు బదులుగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఫొటో ముద్రించారు. దీంతో నాయకులు ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే ఫొటో ఎందుకు ముద్రించలేదని అధికారులను ప్రశ్నించారు. దీంతో అధికారులు అప్రమత్తమై వెంటనే అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఫొటో కనిపించకుండా తెల్లపేపరును అంటించారు. మరోసారి ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని అధికారులు వివరించారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం తగదు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో ఎలాంటి అనుమతులు లేకుండా ఐస్‌క్రీమ్ పార్లర్‌లను నిర్వహిస్తున్నారని కౌన్సిలర్ బాలునాయక్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు పాటించని ఐస్‌క్రీమ్ పార్లర్‌లతో చిన్నారులకు పలు సమస్యలతో పాటుగా, అనేక రోగాల బారిన పడే అవకాశముందన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో, గాంధీనగర్, నిర్మల విద్యాలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదని ఆయన వివరించారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా ఇలాంటి నిబంధనలు లేని వాటిపై స్పందించి చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారులు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.